క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

వైరా: ఇటీవల ఖమ్మంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో వైరాలోని మేరీ ఇమ్మా క్యులేట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ముగ్గురు విద్యార్థులు బంగారు, ఆరుగురు వెండి పతకాలతో పాటు మరో ఎనిమిది మందికి కాంస్యపతకాలు సాధించగా, వారిని గురువారం కరస్పాండెంట్ సోఫియా, హెచ్‌ఎం రాజపుష్పం, కరాటే మాస్టర్లు నరేష్, నవ్య అభినందించారు.

కరాటే శిక్షణ తరగతులు

వైరారూరల్: మండలంలోని గన్నవరం జెడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థినులకు గురువారం కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించారు. విద్యార్థినులు తమ ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కూరాకుల సైదయ్య, కరాటే శిక్షకులు నవ్య, యశ్వంత్‌లు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

పెనుబల్లి : సత్తుపల్లి నవచైతన్య స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆశ్రీ సొసైటీ, ఖమ్మం డిస్ట్రిక్ట్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అనాథ విద్యార్థులకు కావాల్సిన వస్తువులను అందించారు. ఉప్పలచెలక కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న అనాథ విద్యార్థినులకు దుపట్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, పల్ ఆక్సోమీటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో నవచైతన్య స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గాదె నరసింహారెడ్డి, తోట కిరణ్, బొల్లెపోగు సురేష్, సంబూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం, భీమవరం గ్రామాల్లోని సాయి బాబా ఆలయాల్లో గురువారం సాయిబాబాకి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసాయిబాబాకు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు చేశారు. ఎర్రుపాలెం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ నియామకాలకు ఉచిత శిక్షణ

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి ఫిబ్రవరి 15 వరకు పోలీస్ నియామక ప్రక్రియ శారీరక శిక్షణ, దేహాదారుఢ్య పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు, సీనియర్ శిక్షకుడు పసుపులేటి వీరరాఘవయ్య, ఏనుగుల అంజిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు క్రీడా ప్రాంగణమందు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. కావున అర్హులైన అభ్యర్థులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూచన మేరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఈకేవైసీ నమోదు

ముదిగొండ: నిరుపేదలకు ఉచిత ఆరోగ్య కార్డులు జారీ చేసేందుకు ఆరోగ్యశ్రీ కార్డుగా ఉపయోగించేందుకు, ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇవ్వనున్నట్లు ఆరోగ్యమిత్ర కోఆర్డినేటర్ గోపి తెలిపారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ కార్డుల కోసం ఆహారభద్రత కార్డును గ్రామాల్లో ఆరోగ్య మిత్రలు ఈకేవైసీ నమోదు చేస్తున్నారు. మండలంలోని కమలాపురంలో గురువారం ఆరోగ్యమిత్ర ఉడత గోపి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించి ప్రభుత్వ యాప్‌లో నమోదు చేశారు.

విద్యారంగాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

మధిర: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించడం పట్ల ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడారు. కార్యక్రమంలో సాయి వెంకట్, కిరణ్, క్రాంతి, స్వాతి పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగికి సత్కారం

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో పని చేస్తున్న ఫిట్ సెక్రటరీ జేఎస్ఆర్ మూర్తిని గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శాలువాతో సత్కరించారు. ఇటీవల ఉత్తమ ఉద్యోగి అవార్డుకు ఎంపికైన సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమా, కౌన్సిలర్ అనీల్, పట్టణ అధ్యక్షులు రఫీ, సింగరేణి ఉద్యోగులు పాల్గొన్నారు.

గుండె గు'బిల్లు'

ప్రజలపై ఏసీడీ భారం

- పరిమితికి మించి యూనిట్లు వాడితే అదనపు వసూళ్లు
- పేదలకు భారంగా కరెంట్ బిల్లులు



మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా ఉంది పేద, మధ్య తరగతి కుటుంబాల పరిస్థితి. ఇప్పటికే ఒక వైపు నిత్యావసరాలు, గ్యాస్, పెట్రోల్ వంటి వాటి ధరలు ఆకాశాన్నంటి ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. విద్యుత్ బకాయిలు మరింత భారంగా మారాయి. తీసుకున్న వాట్ల కంటే అదనపు యూనిట్లు వాడుకున్నారనే పేరుతో వచ్చిన విద్యుత్ బకాయిల కంటే ఏసీడీ పేరుతో అదనంగా వసూళ్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పేద, మధ్యతరగతి కుటుంబాల బతుకు బండి లాగడం భారంగా మారింది.

వైరా రూరల్: ప్రభుత్వాలు విధించిన ఏసీడీ (అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్) బిల్లుల ఆంక్షలు సామాన్య ప్రజలకు భారంగా మారాయి. గతంలో కేటగిరి–2, హైవాల్యూ సర్వీస్ కనెక్షన్లు తీసుకున్న వినియోగదారులకు మాత్రమే విద్యుత్ శాఖ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అదనపు ఛార్జీలు వసూలు చేసేది. కానీ ప్రస్తుతం కేటగిరి–1 కనెక్షన్లు ఉన్న వారిపై కూడా ఏసీడీ బిల్లుల ప్రభావం పడుతోంది. వినియోగదారులు విద్యుత్ శాఖ నుంచి సర్వీస్ కనెక్షన్ తీసుకునే సమయంలో వారి వినియోగానికి అనుగుణంగా విద్యుత్ శాఖకు కొంత మొత్తంలో నగదు చెల్లించి సర్వీస్ పొందాల్సి ఉంది. ఆ సమయంలో విద్యుత్ శాఖ వినియోగదారులు తీసుకున్న సర్వీస్ కనెక్షన్‌కు అనుగుణంగా నెల సారి యూనిట్లను మంజూరు చేస్తారు. కానీ విద్యుత్‌శాఖ కేటాయించిన యూనిట్ల కంటే వినియోగదారుడు అదనపు యూనిట్లు వినియోగిస్తే.. ఏడాది మొత్తం మీద వాడుకున్న యూనిట్లను లెక్కించి దానిపై రెండు నెలల కరెంట్ బిల్లు ఛార్జీలను జత చేసి ఏసీడీ రూపంలో అదనపు భారం మోపనున్నారు. అదే విధంగా సర్వీస్ కనెక్షన్ తీసుకునే సమయంలో డిపాజిట్ చేసిన నగదు విద్యుత్ శాఖలో పెండింగ్ ఉంటే అందులో నుంచే ఏసీడీ బిల్లులు కట్ అవుతాయని డిపాజిట్ నగదు పెండింగ్ లేని వినియోగదారుల నుంచే ఏసీడీ బిల్లులను వసూలు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ధృవీకరించారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం కరెంట్ బిల్లుల ఛార్జీలు అదనంగా వసూలు చేసి పేదలపై భారం మోపుతున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

కేటగిరిల వారీగా విద్యుత్ సరఫరా..

విద్యుత్ శాఖ అందించే కొత్త సర్వీస్‌లలో ప్రధానంగా 3 రకాల కేటగిరిలు ఉంటాయి. ఇందులో కేటగిరి–1ను డోమాస్టిక్ పరిధిలో ఇంటి అవసరాల నిమిత్తం, కేటగిరి–2 వ్యాపార అవసరాల రిత్యా, అదే విధంగా అధిక లోడ్ కోసం హెచ్‌వీ హైవాల్యూ సర్వీస్ కనెక్షన్లు కేటాయిస్తారు. కేటగిరి–1లో కిలో వాట్ బేసిక్ లోడ్ నుంచి 8 కిలోల వాట్ లోడ్ వరకు అనుమతి ఉంటుంది. వినియోగదారు కేటగిరి–1 కొత్త సర్వీస్ తీసుకుంటే తన ఇంటి అవసరాలకు అనుగుణంగా కిలో వాట్ లోడ్‌ను ఎంచుకొని విద్యుత్ శాఖకు కొంత మేర నగదు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అదే విధంగా కేటగిరి–2 వ్యాపార రిత్యా 90 కిలో వాట్ బేసిక్ లోడ్, హెచ్‌వీ హైవాల్యూ సర్వీస్‌కు త్రీఫేజ్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. కాగా గతంలో కేటగిరి–2, హైవాల్యూ సర్వీస్ కనెక్షన్ల వినియోగదారులకు కేటాయించిన యూనిట్ల కంటే అదనపు యూనిట్లు వాడుకుంటే ప్రతి 4, 6 నెలలకు ఒకసారి విద్యుత్ శాఖ అదనపు ఛార్జీలు వసూలు చేసేది.

సామాన్య ప్రజలపై భారం..

అధిక యూనిట్లు వినియోగించని సామాన్యులకు కూడా ఈ ఏసీడీ బిల్లులు వస్తుండడంతో ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఏసీడీ బిల్లుల రూపంలో అదనపు వసూళ్లను రద్దు చేయాలని కోరుతున్నారు.

రూ.1,550 వచ్చింది..



ప్రతి నెల విద్యుత్ బకాయిలు పెండింగ్ లేకుండా కడుతున్నాను. అయిన ఈ నెల ఏసీడీ బిల్లు రూ.1,550 వచ్చింది. విద్యుత్ బకాయి కంటే ఏసీడీ బిల్లు భారం అధికమైంది. అధికారులను సంప్రదిస్తే అధిక యూనిట్లు వినియోగించుకోవడం వలన ఈ బిల్లు వచ్చిందని చెబుతున్నారు. కానీ ఈ నెల ఏసీడీ బిల్లు అని భారం మోపుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి దీనిని నియంత్రించాలి.
– నారపోగు నాగరాజు, సిరిపురం

సామాన్య ప్రజలపై భారం..



ప్రభుత్వం విధించిన ఏసీడీ బిల్లులు రెక్కాడితే కానీ డొక్కాడని సామాన్య ప్రజలకు భారంగా మారాయి. ఒక వైపు ఇప్పటికే నిత్యావసరాలు, కరెంట్ బిల్లుల ఛార్జీలు రెండింతలు అయిన నేపథ్యంలో ఇప్పుడు ఈ ఏసీడీ బిల్లుల ప్రభావం వలన మరింత భారంగా మారాయి. ఏసీడీ బిల్లు రద్దు చేసి పేద ప్రజలపై ఆర్థిక భారం మోపకుండా చర్యలు తీసుకోవాలి.
– యమాల గోపాలరావు, సీపీఐ మండల కార్యదర్శి

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



సత్తుపల్లిటౌన్: కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కె.సుజాత

తల్లాడ/ముదిగొండ/సత్తుపల్లిటౌన్/కారేపల్లి: మండలాల్లోని నిర్వహిస్తున్న రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాలను వినియోగించుకోవాలని తల్లాడ ఎంపీపీ శ్రీనివాసరావు, ముదిగొండ ఎంపీడీఓ శ్రీనివాసరావు, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, కారేపల్లి సింగరేణి జెడ్పీటీసీ సభ్యుడు వాంకుడోతు జగన్ నాయక్, ఎంపీపీ మాలోత్ శకుంతల అన్నారు. ఈ సందర్భంగా కొత్త వెంకటగిరి గ్రామంలో, కారేపల్లిలోని మంగళితండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.రవీంద్రరెడ్డి, మండల వైద్యాధికారి రత్న మనోహర్, బిల్లుపాడు ఎంపీటీసీ బ్రహ్మం, నరేష్, కోటేశ్వరరావు, గంగారం పీహెచ్‌సీ వైద్యుడు అవినాష్, సూపర్‌వైజర్ నర్సింహారావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీటీసీ రూపానాగేశ్వరరావు, సర్పంచ్ స్వర్ణవీరన్న, వైద్యాధికారి శ్రేష్ట, గ్రామ కార్యదర్శి తిలక్‌కిషోర్, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, ఎఎన్ఎంలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

వైరా: ప్రభుత్వం విధించిన ఏసీడీ చార్జీలు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఎం, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో వైరాలో ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు, బీజేపీ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ రాథోడ్‌లు మాట్లాడుతూ.. ఏసీడీ చార్జీల పేరుతో పేద మధ్య తరగతి వర్గాల ప్రజలపై అదనపు భారాన్ని మోపుతున్నారన్నారు. తక్షణమే ఛార్జీలు రద్దు చేయాలని ట్రాన్స్‌కో డీఈకి వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, బీజేపీ నాయకులు సుధాకర్, రవీందర్, మచ్చా మణి, సాంబశివరావు, సుధాకర్, ప్రసాదరావు, కృష్ణవేణి, నెల్లూరి కోటేశ్వరరావు, విజయ రెడ్డి, ఏలే భద్రయ్య, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చింతకాని: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాదిల వెంకన్న తెలిపారు. చినమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందటంతో ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

పెనుబల్లి : లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన పెనుబల్లి మండలం రామచందర్‌రావు బంజర్ వద్ద గురువారం చోటు చేసుకుంది. రామచందర్‌రావు బంజర్‌కు చెందిన మరకాల రాము ద్విచక్రవాహనంపై వీఎం బంజర్ వైపు వస్తుండగా సత్తుపల్లి నుండి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన రామును పెనుబల్లి ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కారేపల్లి: జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని గుట్టకిందిగుంపు గ్రామానికి చెందిన రైతు ఈసం పాపయ్య(50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా గత నెల 29వ తేదీన పురుగుల మందు తాగాడు. ఆయనకు ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందడంతో, కుటుంబీకుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు తెలిపారు.

బడ్జెట్‌లో పేదప్రజలకు అన్యాయం

ఏన్కూరు/కల్లూరు: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద ప్రజలకు అన్యాయం జరిగిందని సీపీఎం మండల కార్యదర్శి డి.నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తన్నీరు కృష్ణార్జున రావు తెలిపారు. మండల కేంద్రాల్లోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేపర్‌ను గురువారం దహనం చేశారు. ఈ బడ్జెట్‌లో అవసరమైన నిర్ణయాలు చేయలేక పోయారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు సామినేని హనుమంత రావు, వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం కమిటి సభ్యులు రావి వెంకటసత్యం, రైతులు రావి అజయ్, మండేపూడి పెద్ద నరసయ్య, సామినేని సత్యం, మండేపూడి వీరభద్రం, సీపీఎం నాయకులు బాణోత్ బాలాజీ, లక్ష్మా, ఇటికాల లెనిన్, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఏన్కూరు: బడ్జెట్ పేపర్‌ను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

అడవుల పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతను వివరిస్తున్న రేంజర్ వెంకటేశ్వర్లు

సత్తుపల్లిటౌన్: అడవులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సత్తుపల్లి అటవీశాఖ రేంజర్ ఎ.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ వెట్‌ల్యాండ్స్‌డే సందర్భంగా గురువారం పట్టణంలోని అర్బన్‌పార్కును స్థానిక వాణి విద్యాలయం విద్యార్థులు సందర్శించారు. పార్కులోని గుట్టప్రాంతాలు, చెరువు, క్లాక్ టవర్‌లను తిలకించారు. అనంతరం అడవుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు రేంజర్ వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ముత్యాలరావు, సింగరేణి వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్ దీపక్ నారాయణ్, ఎఫ్ఎస్ఓ నర్సింహులు, ఎఫ్‌బీఓలు ముక్తి వెంకటేశ్వర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుర్నవల్లిలో నవ భారత నాట్య మండలి వార్షికోత్సవం

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి గ్రామంలో గురువారం నవ భారత నాట్య మండలి 47వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చదువు – సేద్యం అనే నాటికను కళాకారులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తల్లాడ జెడ్పీటీసీ సభ్యురాలు దిరిశాల ప్రమీలను కళాకారులు పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. ప్రమీల మాట్లాడుతూ.. నాటి గ్రామీణ కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తొలుత స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి కళాకారులు పుతుంబాక శ్రీ కృష్ణ ప్రసాద్, తోట కొండల నరసింహారావు, పాతాళపతి రోశయ్య చౌదరి, కుర్నవల్లి నవభారత నాట్య మండలి అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్‌రెడ్డి, శీలం వెంకటనారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మి, కుర్నవల్లి సొసైటీ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, ఎంపీటీసీ కళావతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కుర్నవల్లిలో జెడ్పీటీసీ ప్రమీలను సన్మానిస్తున్న కళాకారులు

పోషకాహారంతోనే చిన్నారులలో ఎదుగుదల

ఏన్కూరు: పోషకాహారంతోనే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటమ్మ, రేఖభాయి తెలిపారు. మండలంలోని రాజలింగాల, ఏన్కూరు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సూపర్‌వైజర్లు సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఎత్తు, బరువు పరిశీలించారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న సరుకులను రిజిస్టర్ల ప్రకారం ఉన్నాయా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వేంసూరు: మండలంలోని పల్లెవాడ, చౌడవరం అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం పీడీ సంధ్యారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ హాజరుశాతాన్ని పరిశీలించి బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కొండమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



ఏన్కూరు: చిన్నారి ఎత్తును పరిశీలిస్తున్న దృశ్యం

వెదజల్లే పద్ధతిలో వరిసాగు లాభదాయకం

మధిర: వరిలో వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి కె.వంశీకృష్ణ సాయి అన్నారు. మండలంలోని మధిర, మల్లవరం, మాటూరు, సిరిపురం, ఖమ్మంపాడు, రాయపట్నం, దెందుకూరు క్లస్టర్ పరిధిలో గురువారం వ్యవసాయ శాఖ ఏఈఓలు రైతులకు అవగాహన కల్పించారు. పీఎస్‌బీ అంటే భాస్వరాన్ని కరిగించే బాక్టీరియా అని, ఇది భూమిలో లభ్యంకాని రూపంలో ఉన్న భాస్వరాన్ని ఈ బాక్టీరియా జాతులు లభ్యరూపంలోకి మార్చి మొక్కకు అందిస్తాయని తెలిపారు. ఈ జీవన ఎరువులను రెండు పద్ధతుల్లో వినియోగించవచ్చునన్నారు. పశువుల ఎరువుతో గాని వర్మికాంపోస్ట్‌లో కలిపి నేలపై జల్లడం, విత్తన శుద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జగన్, ములకలపల్లి వినయ్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన..

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి గ్రామంలో పిలకదశలో ఉన్న వరి పైర్లను గురువారం మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.పవన్‌కుమార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వరి పైర్లకు కాండం తొలుచు పురుగు, మోగి పురుగు తెగుళ్ల ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ముదురు నాట్లు, రాత్రి తక్కువ ఉష్ణోగ్రతలు, నత్రజని తక్కువ వాడడం వంటి కారణాల వలన ఈ తెగుళ్లు సోకుతాయని తెలిపారు. దీని నివారణకు కార్బోఫ్యూరాన్ గ్రాన్యూల్స్ 4 కేజీలు, 10 కిలోల గుళికలు, కార్టప్ హైడ్రోజన్, ఇమాక్టిన్ బెంజోనైట్ 4 కేజీల గుళికలను చల్లాలని వివరించారు. అదే విధంగా క్లోరాంత్రినిలిప్రోల్, ఫ్లూబెండమైడ్ ఎకరానికి 60 మిల్లీ లీటర్ల చొప్పున లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

'ఆశా'ల సమస్యలు పరిష్కరించాలి



మధిర: మాట్లాడుతున్న శీలం నరసింహారావు

మధిర/తల్లాడ/ఏన్కూరు: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు శీలం నరసింహారావు, సీఐటీయూ తల్లాడ మండల కార్యదర్శి షేక్ మస్తాన్, సీఐటీయూ ఏన్కూరు మండల కార్యదర్శి ఏర్పుల రాములు అన్నారు. ఈ సందర్భంగా గురువారం మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి వెంకటేష్‌కు, తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మండల వైద్యాధికారి రత్న మనోహర్‌కు వినతులు అందించారు. ఏన్కూరులోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనిభారంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి ఉద్యోగ భద్రతతో పాటు ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా నాగేశ్వరరావు, ఆశ వర్కర్ల సంఘం మండల నాయకురాలు రాణి, నాగమణి, శాంతమ్మ, కృష్ణకుమారి, శ్యామల, నీలిమ, నాగలక్ష్మి, కల్యాణి, ఆశావర్కర్లు యూనియన్ జిల్లా కార్యదర్శి బాణోత్ అమల, కమల, భవాని, కృష్ణవేణి, శారద, మౌనిక, లక్ష్మి, రాజ్యం, నాగమణి, రజిత, అరుణ, మాధవి, అనూష తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



మాట్లాడుతున్న డీఎల్పీఓ ప్రభాకర్‌రావు

బోనకల్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 2023–24 సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డీఎల్పీఓ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. 2023 – 2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీలలో చేపట్టాల్సిన పనులు, కేంద్ర నుంచి వచ్చే నిధులపై సర్పంచ్‌లకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుమాధవ్, డిప్యూటీ తహసీల్దార్ శ్వేత, వైద్యాధికారి స్రవంతి పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

పెనుబల్లి: సీసీ రోడ్డును ఆక్రమించారని సాయినగర్‌కు చెందిన ఇస్లవత్ జాన్సీ ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. మండలంలోని బయ్యన్నగూడెం పంచాయతీ సాయినగర్‌లో పంచాయతీ రాజ్ శాఖ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని, దీని వల్ల సీసీ రోడ్డు పక్కనే డ్రెయినేజీ సౌకర్యం లేక మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుందని గురువారం జాన్సీ ఎంపీడీఓకు వినతి అందించారు. రోడ్లపై మురుగు ప్రవహించడంతో ఇబ్బందిగా ఉంటుందని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఆమె వినతిపత్రంలో కోరారు.

బీఆర్‌ఎస్‌ను విమర్శించడం సరికాదు

తల్లాడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను విమర్శించడం సరికాదని తల్లాడ మండల బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఎంపీపీ చాంబర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేస్తున్న విమర్శలను ఖండించారు. వేరే పార్టీలో చేరాలంటే చేరు కానీ బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రెడ్డెం వీరనరసింహారెడ్డి, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, గుండ్ల వెంకటేశ్వర్లు, దగ్గుల శ్రీనివాసరెడ్డి, బద్దం కోటిరెడ్డి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, చల్లా నాగులు, కోడూరి వీరకృష్ణ, దుగ్గిదేవర వెంకట్‌లాల్, రుద్రాక్ష బ్రహ్మం, తేళ్లూరి రఘు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

కారేపల్లి: పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా నాయకుడు కొండెబోయిన నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని ఎర్రబోడు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు కొండా రాధాకృష్ణమూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి సీపీఎం నాయకుల బృందం నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో వజ్జా రామారావు, పండగ కొండయ్య, రవి, శ్రీను, నాగేశ్వరరావు, తిరుపతయ్య, నవీన్, యాదగిరి, సర్పంచ్ సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ రామారావు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ..

కల్లూరురూరల్: మండలంలోని కప్పలబంధం వద్ద సాగర్ ప్రధాన కాలువ వద్ద జారిపడి మృతి చెందిన లక్కిరెడ్డి రామిరెడ్డి, గుర్రాల లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎంపీ నామా నాగేశ్వరరావులు ఫోన్ ద్వారా పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రమాదంలో చనిపోయిన ఇద్దరు రైతు కుటుంబాలు సన్నా, చిన్నకారు రైతులు కావడంతో ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. కల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్‌కుమార్, సర్పంచ్ ప్రసాద్, జిల్లా రైతు సమితి సభ్యుడు చందర్‌రావు, డాక్టర్ లక్కినేని రఘు, ఎండీ ఇస్మాయిల్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మట్టి డంపర్లను అడ్డుకున్న రైతులు

వైరారూరల్: గతుకులతో అధ్వానంగా ఉన్న వైరా – మధిర రోడ్డును అభివృద్ధి చేసేందుకు గత ఆరు నెలల క్రితం రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు మరమ్మతులకు మట్టి సమస్య ఏర్పడడంతో సంబంధిత శాఖాధికారులు, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. విషయం తెలుసుకున్న కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలను అందించారు. దీంతో కాంట్రాక్టర్ నెలరోజుల వరకు కొండకొడిమ గ్రామ శివారులో ఉన్న గుట్ట మట్టిని తోలుకునేందుకు రూ.89 వేలు చలానా రూపంలో చెల్లించాడు. తహసీల్దార్ సూచనల మేరకు జిల్లా ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ క్రమంలో ఆ గుట్ట మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్న నేపథ్యంలో స్థానికంగా ఉండే కొంతమంది గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ మట్టిని తరలించడం వలన పర్యావరణం దెబ్బతినడంతోపాటు ఈజీఎస్ పనుల కింద నాటిన మొక్కలు ధ్వంసం అవుతాయన్నారు. దీంతో తొలిరోజు వైరా – మధిర అభివృద్ధి పనులకు అంతరాయం ఏర్పడింది.



మట్టి డంపర్లను అడ్డుకున్న రైతులు